నీరుగారిన లక్ష్యం.. రైతులకు నష్టం

- మూతపడిన పురుషోత్తపట్నం పథకం
- టీడీపీ తప్పిదాలతో అన్నదాతలకు కష్టాలు
- అదనపు పరిహారానికి ఎమ్మెల్యే రాజా కృషి



పురుషోత్తపట్నంలో మూతపడిన ఎత్తిపోతల పథకం

సీతానగరం: గత టీడీపీ ప్రభుత్వ తప్పిందాలు రైతులను ఇంకా వెంటాడుతున్నాయి. ఇప్పటికీ అవి చిక్కుముడులుగానే మిగిలాయి. రైతుల నుంచి బలవంతంగా తీసుకున్న పంటభూములకు అందించే పరిహారాన్ని 2013 భూసేకరణ చట్టం ప్రకారం అందించాలని రైతులు డిమాండ్ చేసినా పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కొందరు రైతులు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం అందుకోగా, మరి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. టీడీపీ ప్రభుత్వ హయాలో గోదావరి జలాలను తరలించి సాగు విస్తీర్ణం పెంచాలనే ఆలోచనతో ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు.

టీడీపీ తీరుతో రైతులకు నష్టం

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఎత్తిపోతల పథకాలు నిరుపయోగమని వైఎస్సార్ సీపీ ఎలుగెత్తి చెప్పినా టీడీపీ ప్రభుత్వం తన జేబులు నింపుకోవడానికి పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నెలకొల్పింది. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా విశాఖపట్నం వరకు సాగు, తాగునీటిని అందించాలనేది దీని లక్ష్యంగా తీసుకున్నారు. పురుషోత్తపట్నం నుంచి పది కిలోమీటర్ల దూరంలోని గండికోట వద్ద పోలవరం ఎడమ కాలువలోకి పైపులైన్ కలిపి, ఏలేరు రిజర్వాయర్‌లోకి నీటిని పంపడానికి అధికారులు నిర్ణయించారు. పది కిలోమీటర్ల పైప్‌లైన్‌కు వంగలపూడి, పురుషోత్తపట్నం, చినకొండేపూడి, నాగంపల్లి రెవెన్యూ గ్రామాల్లో 334 మంది రైతులకు చెందిన 207 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 244 మంది రైతులు ముందుగా భూమి అప్పగించారు. వీరికి ఎకరానికి రూ.24 లక్షల నుంచి రూ.28 లక్షలు పరిహారంగా అందించారు. 70 ఎకరాల భూమికి చెందిన 110 మంది రైతులు 2013 భూసేకరణ చట్టం అమలు చేసి, ఎకరానికి రూ.34 లక్షలు చెల్లించాలని డిమాండ్‌తో సంతకాలు చేయలేదు. దీనితో పోలీస్ రక్షణతో రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకున్నారు. దీనితో రైతులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించడంతో ఈ ఎత్తిపోతల పథకం లక్ష్యాన్ని చేరుకోకుండానే 2019లో మూతపడింది.

జక్కంపూడి రాజా పోరాటం

టీడీపీ ప్రభుత్వ హయాంలో జక్కంపూడి రాజా రఘుదేవపురంలో రైతులకు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రైతులకు అందించే పరిహారం కోసం విశేషమైన కృషి చేశారు. ఇందులో భాగంగానే వారం రోజుల క్రితం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు అదనపు పరిహారం అందించాలని అమరావతిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కలిసి, అలాగే జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బలవంతంగా..



టీడీపీ ప్రభుత్వం ఎందుకు పనికిరాని పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం బలవంతంగా 4.32 ఎకరాలను తీసుకుంది. వారు అందించే పరిహారం కాకుండా 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఇవ్వాలని కోరాం. మాపై కేసులు పెట్టి వేధించడంతో హైకోర్టును ఆశ్రయించాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రైతులకు అదనపు పరిహారం అందించాలని విశేషమైన కృషి చేస్తున్నారు.

– కరుటూరి శ్రీనివాసరావు, రైతు, రామచంద్రపురం

విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌లో శిక్షణ



ఎంఓయూలను అందుకుంటున్న మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఫ్రాంక్లిన్ టెక్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్‌తో మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ) కుదుర్చుకున్నామని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.శివకుమార్‌తో కలసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ ఒప్పందంలో భాగంగా ఈ సంస్థ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై ఆసక్తి గల విద్యార్థులకు ఆరునెలల పాటు సంబంధిత శిక్షణ, ఇంటర్న్‌షిప్ ఇచ్చి ఐఎస్ఓ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందజేస్తుందన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన పూర్వ విద్యార్థి మహ్మద్ ఆసిఫ్ సహకారంతో గొప్ప సంస్థతో ఎంఓయూ కుదుర్చుకోవడం హర్షణీయమన్నారు.

క్లుప్తంగా

నేడు చిన్నారులకు వైద్య శిబిరం

పెదపూడి: జి.మామిడాడలో రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లల మామిడాడ వారిచే శుక్రవారం చిన్నారులకు గుండె స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆ క్లబ్ ఫౌండర్ నల్లమిల్లి బుచ్చిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక జెడ్పీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి నుంచి 5వ తరగతి చదివే చిన్నారులకు శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. కాకినాడలో ప్రముఖ గుండె వైద్య నిపుణుడు జి.ఓబుల్‌రెడ్డి ఈ పరీక్షలు చేస్తారన్నారు. నడిచేటప్పుడు ఆయాసం వచ్చే చిన్నారులు, బరువు పెరగకపోవడం, కాళ్లలో వాపులు వచ్చే చిన్నారులు కచ్చితంగా ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

పెదపూడి: మండలంలో పంట నమోదు పూర్తయిందని, రైతులంతా ఈ నెల 25 లోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. గురువారం పెదపూడిలో రైతుల నుంచి ఈకేవైసీ (వేలు ముద్రలు సేకరణ) ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 90 శాతం మేర రైతులు ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు స్థానిక రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈకేవైసీ వేసి పంట నమోదు ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: పురుషోత్తపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు, నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రమోహన్ తెలిపారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, చీపురపల్లి, అచ్చియ్యపాలెం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

భోజనం వితరణ



భోజనం అందజేస్తున్న దృశ్యం

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాత జయవరపు గొల్లబాబు సహకారంతో గురువారం భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. 150 మంది నిరుపేదల ఇళ్లకు వెళ్లి మందిరం సేవాసమితి సభ్యులు వీటిని పంపిణీ చేశారు.

వ్యాధుల నివారణపై అవగాహన

రాజానగరం: కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన వైద్యం అందిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ టి.రవి కుమార్ అన్నారు. కుష్టు, బోద వ్యాధులకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై పీహెచ్‌సీ సిబ్బందికి గురువారం శిక్షణ జరిగింది. బ్రైట్ ఫ్యూచర్ సంస్థ ఆధ్వర్యంలో రీచ్ మీ ప్రాజెక్టు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) కుష్టు వ్యాధిగ్రస్తులకు ఒక వరమన్నారు. రీచ్ మీ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ ఎం.రంగనాథరావు, సీహెచ్ఓ కృపాబాయమ్మ పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

రంగంపేట: తాగునీటి పైప్‌లైన్ లీకవడంతో రంగంపేట గ్రామ శివారు ఎస్టీ కాలనీకి మూడు రోజులుగా సరఫరా నిలిచిపోయింది. దొంతమూరు సీపీడబ్ల్యూఎస్ పథకం నుంచి ఎస్టీ కాలనీకి వచ్చే పైప్‌లైన్ ఏడీబీ రోడ్డు విస్తరణ కారణంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కట్ అయ్యింది. గురువారం పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టామని, శుక్రవారం నుంచి యథావిధిగా నీటిని అందిస్తామని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.సాయికుమార్ తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని కేవీఎస్ కళాశాల 17వ వార్షికోత్సవంలో గురువారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మంచి రంగాల్లో స్థిరపడవచ్చన్నారు. గతంతో పోలిస్తే మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, మహిళా సాధికారితకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలు రిజర్వేషన్లు, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్య, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నాయకులు కర్రి సూరారెడ్డి, దాసరి రమేష్, సుంకర వీరబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



నల్లమిల్లి కాంతమ్మ, ఎస్ఎస్, రాంబాబులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా పెడపర్తి సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అనపర్తికి చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ఎస్), పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా వెంకటాపురానికి చెందిన మంగిన రాంబాబు నియమితులయ్యారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని ఎమ్మెల్యే పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యేను వారు సన్మానించారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పార్టీ బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికగా సాగితే ఉజ్వల భవిత

రంగంపేట: విద్యార్థులు ప్రణాళికగా సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయన్నారు. మార్చి 15 నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయని, విద్యార్థులు ఏవిధమైన ఒత్తిడికి గురికాకుండా ప్రణాళిక ప్రకారం చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో కళాశాల విద్యార్థులు

అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

- ఏడాదిలో బొబ్బిల్లంక – ములకల్లంక బ్రిడ్జి పూర్తి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కాతేరు - సీతానగరం రోడ్డు విస్తరణ పనులను బొబ్బిల్లంక వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రణాళికాబద్ధంగా, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ చేసే పనులు శాశ్వతంగా నిలుస్తాయని, నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి పనుల్లో అదే విధానం పాటిస్తున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బొబ్బిల్లంక - ములకల్లంక బ్రిడ్జి, కాతేరు – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులను గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ములకల్లంక – బొబ్బిల్లంక బ్రిడ్జిని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకువెళుతున్నామన్నారు. గోదావరి వరదలు వచ్చేలోపు కనీసం పియర్ కాప్స్‌పై వేసే బీమ్‌ల వరకు పూర్తి చేస్తామన్నారు. వరద తగ్గుముఖం పట్టాక శ్లాబ్ వేయాలని ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ ఏడాదిలో పూర్తి చేస్తామని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

కాతేరు నుంచి సీతానగరం వరకు చేపడుతున్న నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టంగా నిర్మించుకుంటూ వస్తున్నామన్నారు. కొన్నిచోట్ల సిమెంటు డ్రైనేజీల నిర్మాణం జరుగుతోందన్నారు. జూలై చివరకు రోడ్డు నిర్మాణాన్ని ఒక రూపానికి తీసుకువస్తామన్నారు.

త్వరలో కార్యరూపం దాల్చనున్న సీహెచ్‌సీ

సీతాగనరం పీహెచ్‌సీ స్థానంలో నిర్మించనున్న 30 పడకల కమ్యూనిటీ ఆసుపత్రి త్వరలోనే కార్యరూపం దాల్చనుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నానని, బుధవారం ముఖ్యమంత్రిని కలిసి ఈ అంశాన్ని ఆయన దృష్టిలో ఉంచానని తెలిపారు. రఘుదేవపురం వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న డీసీఎంఎస్ భూమిలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి మండలానికి కనీసం రెండు పీహెచ్‌సీలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని, సీతానగరం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మారుతున్నందున బొబ్బిల్లంకలో రూ 1.50 కోట్లతో పీహెచ్‌సీ ఏర్పాటుచేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, కాటవరం ఎంపీటీసీ తాడేపల్లి వెంకట్రావు, పార్టీ నాయకులు మద్దిపాటి సుబ్బారావు, మల్లిన చౌదరి, ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు, ప్రాజెక్ట్ డీఈ ధర్మరాజు, బ్రిడ్జి కాంట్రాక్టర్ విశ్వేశ్వరరావు ఉన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలతో ప్రగతి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి

రాజానగరం: బ్యాంకు లింకేజీ రుణాలతో జీవనోపాధిని మెరుగుపర్చుకుని ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధిని సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి అన్నారు. మండలంలోని శ్రీరామపురంలో గురువారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, సకాలంలో తిరిగి చెల్లింపులు జరిగితే మరి కొందరికి పరోక్షంగా సహాయపడిన వారవుతారన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలను అనుసరించి, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఏవిధంగా వినియోగించుకుంటున్నారు, తద్వారా వారి ప్రగతి ఏవిధంగా ఉంటుంది అనే విషయాలను పరిశీలించడంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఆయా సంఘాల పనితీరు, వ్యాపార లావాదేవీలు, మార్కెటింగ్ సదుపాయాలు, యూనిట్లు/రికార్డుల నిర్వహణ, కుటుంబ సభ్యుల స్థితిగతులను ఆరా తీశారు. సమావేశంలో బ్యాంకు లింకేజీ డీపీఎం గణేష్, ఏపీఎం హేమనాగలక్ష్మి, సీసీ కన్న బాబు, సీసీఎస్సీ సింహాచలం, అకౌంటెంట్ నాని, వీఓఏ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విష్ణుమూర్తి మృతికి సంతాపం



విష్ణుమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని పాత వెలుగుబందకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి విష్ణుమూర్తి (62) గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాత వెలుగుబందకు చేరుకుని విష్ణుమూర్తి పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి, దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావుతో కలిసి పనిచేసిన విష్ణుమూర్తి మరణం తమ కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరని లోటన్నారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు ఆకుల శ్రీను, కొల్లి వీర్రాజు, కుందేటి ప్రసాద్, స్థానిక నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ విభాగాల అధ్యక్షులకు అభినందనలు



అడబాల చినబాబు



పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు)

రాజానగరం/సీతానగరం: వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా రాజానగరం మండలం సీతారామపురానికి చెందిన అడబాల వీరసత్యనారాయణ (చినబాబు), వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా సీతానగరానికి చెందిన పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) నియమితులు కావడంపై పలువురు అభినందనలు తెలిపారు. చినబాబు సీతారామపురం గ్రామ ఉప సర్పంచ్‌గా, నందరాడ సొసైటీ అధ్యక్షుడిగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడిగా అనేక పదవులు నిర్వహించారు. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావుకు అనుచరుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కూడా అత్యంత సన్నిహితునిగా ఉంటున్నారు. డాక్టర్ బాబు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. డాక్టర్ బాబుకు పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, వలవల వెంకట్రాజు అభినందనలు తెలిపారు.

పాఠశాలల్లో పరిశీలన

బిక్కవోలు: కాపవరం గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉన్నత పాఠశాలను ఎంఈఓ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, బోధనా ప్రమాణాలు తనిఖీ చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. పాఠశాల హెచ్ఎంలు జి.ఏడుకొండలు, వి.శ్రీనువాస్, జి.గంగాధరమ్ తదితరులు పాల్గొన్నారు.

బర్ల బాబూరావుపై ఫిర్యాదు

మధురపూడి: దళితుల మనోభావాలను దెబ్బతీశారంటూ టీడీపీ నాయకుడు బర్ల బాబూరావుపై అదే పార్టీకి చెందిన కొయ్యా శామ్యూల్, గండి విజయకుమార్ తదితరులు గురువారం కోరుకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ దళితులకు సుపారీ ఇచ్చి, కిరాయి గూండాలుగా వాడుకుంటున్నారన్న అభియోగాన్ని ఖండించారు. దళితులను కించపరుస్తున్న బర్లపై చర్య తీసుకోవాలన్నారు.

శ్రమకాలం ప్రార్థనలు

మధురపూడి: ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలకు గుర్తుగా ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. కోరుకొండ ఏఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ జోసఫ్ తంబీ వాక్యసందేశాన్నిచ్చారు. ఈ మిషన్ ఆధ్వర్యంలో సీతానగరం మండలం కూనవరంలో ప్రార్థనలు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం, కొంతమూరు, కాతేరు, బూరుగుపూడి చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం ప్రారంభమైన ప్రార్థనలు ఏప్రిల్ 9వ తేదీ వరకూ 41 రోజులు పాటు నిర్వహిస్తారు.

సారా తయారీకి బ్రేకులు వేద్దాం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాజానగరం: సారాను అరికట్టడానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు అన్నారు. సారా తయారీకి బ్రేకులు వేయాలంటే వర్తకుల సహకారం ఎంతో అవసరమన్నారు. తయారీదారులకు నల్లం బెల్లం చేరకుండా డిపార్టుమెంట్‌కు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సౌత్ స్టేషన్ ఎస్సై ఎం.రామశేషయ్య, రాజానగరం వర్తక సంఘం ఉపాధ్యక్షుడు లంక శ్రీనివాస్, ప్రగడ చక్రి, దుర్గాపు వసంతరావు, చవ్వా చరణ్‌గుప్తా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వితరణ



సీతానగరంలో నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ వారి అక్షయ సంజీవని కార్యక్రమంలో భాగంగా గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. సీతానగరంలో ఐదు, పురుషోత్తపట్నంలో ఒకటి, వంగలపూడిలో ఆరు బాధిత కుటుంబాలకు బియ్యం, రూ.రెండు వేలు విలువైన సరకులు అందజేశారు. ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, కాండ్రు వీరన్న, తోరం బ్రహ్మజీ, సలాది వాసు, తోరం పోశయ్య, కోలా శ్రీను, కొంచ భాస్కరరావు, వెలిచేటి మోహర్‌బాబా (సిరి), శరత్ పాల్గొన్నారు.

పల్లిజాన్ మృతిపై విచారణ జరిపించాలి

- తొర్రేడు సెంటర్‌లో కుటుంబ సభ్యుల ధర్నా
- నార్త్‌జోన్ డీఎస్పీ హామీతో విరమణ



తొర్రేడులో ధర్నా చేస్తున్న పల్లిజాన్ కుటుంబ సభ్యులు, ఎస్సీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: మిర్తిపాడు గ్రామంలో నూతిలో పడి పల్లిజాన్ (22) మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలంటూ అతని కుటుంబ సభ్యులు, ఎస్సీ నాయకులు గురువారం తొర్రేడు సెంటర్‌లో ధర్నా చేశారు. తొర్రేడుకు చెందిన పల్లిజాన్ ఈనెల 12వ తేదీన సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో నూతిలో శవమై కనిపించాడు. ఈ మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. పల్లిజాన్ మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఎస్సై దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఎస్సై పట్టించుకోవడం లేదంటూ తొర్రేడు జంక్షన్‌లో ఈనెల 15న ఎస్సీ సామాజిక వర్గీయులందరూ ధర్నా చేశారు. దీంతో సీతానగరం ఎస్సై శుభశేఖర్ పది రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే బుధవారం ఎస్సై శుభశేఖర్ ఫోన్‌చేసి.. జాన్ నూతిలో పడిలో చనిపోయాడని, ఏమైన ప్రభుత్వ పథకాలు వర్తిస్తే పెట్టుకోండి అంటూ దురుసుగా మాట్లాడారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో గురువారం ఉదయం తొర్రేడులో సీతానగరం రహదారిపై ధర్నా నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించడంతో సంఘటనా స్థలానికి నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు చేరుకుని ఎస్సీ నాయకులు, మాజీ సర్పంచ్ ఉప్పులూరి సత్యనారాయణతో మాట్లాడారు. నెల రోజుల్లో విచారణ పూర్తయ్యేలా చూస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు. అలాగే ఎస్సై శుభశేఖర్‌పై చర్యలకుపై అధికారులకు నివేదిస్తామన్నారు. సదరు హామీతో ధర్నాను మధ్యాహ్నం విరమించారు.